సాక్షి జగిత్యాల
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



అంజన్న ఆలయానికి తగ్గిన రద్దీ

కొండగట్టు: కొండగట్టులోని అంజన్న ఆలయానికి శనివారం రద్దీ కాస్త తగ్గింది. పితృ అమావాస్య నేపథ్యంలో భక్తులు తగ్గినట్లు తెలుస్తోంది.



అత్యవసర సేవలకు అంతరాయం

ఉద్యోగ భద్రత కోసం ఆశా కార్యకర్తలు, ప్రతినెలా బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెల్సిందే.. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్నికల నియమావళిని తెలుసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: ఎన్నికల నిబంధనలు, నియామవళిని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణలో సమస్యలు తలెత్తకుండా యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని ఆదేశించారు. మార్గదర్శకాలను తెలుసుకోవాలని, శిక్షణ తరగతుల సమయంలో అందించిన రూల్స్, ఇతర అంశాలకు సంబంధించిన పుస్తకాన్ని అందిస్తామని పేర్కొన్నారు. వాటిని తప్పనిసరిగా పఠనం చేసి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ తిరుపతి, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కోరుట్ల డిపోకు రాఖీ చాలెంజ్ అవార్డు



డీఎంను సత్కరిస్తున్న ఎండీ సజ్జనార్

కోరుట్ల రూరల్: ఆర్టీసీ కోరుట్ల డిపోకు రాష్ట్రస్థాయిలో రాఖీ శ్రావణమాసం ఛాలెంజ్ అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో డిపో మేనేజర్ విజయమాధురికి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అవార్డుతో సత్కరించారు. డ్రైవర్లు, కండక్టర్ల కృషి ఎంతో ఉందని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సజ్జనార్ పేర్కొన్నారు. ఈడీ వినోద్ కుమార్, ఆర్ఎం సుచరిత, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు బాగాలేవని మహిళల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

గొల్లపల్లి: ఆడపడుచులకు ప్రభుత్వం అందిస్తున్న బతుకమ్మ చీరలు నాసిరకంగా ఉన్నాయని పేర్కొంటూ మండలంలోని అబ్బాపూర్ మహిళల నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో శనివారం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో రేషన్‌కార్డుల ఆధారంగా చీరల పంపిణీ చేపట్టారు. చీరలు తీసుకునేందుకు వచ్చిన మహిళలు నాసిరకంగా ఉన్నాయని, పండగకు ఇలాంటి చీరలు ఎవరైనా కట్టుకుంటారా..? అని ప్రశ్నించారు. విషయాన్ని సర్పంచ్ పురంశెట్టి వెంకటపద్మ దృష్టికి తీసుకెళ్లడంతో చీరలు నచ్చకుంటే తీర్మానం చేసి మండల పరిషత్ అధికారులకు పంపిస్తామని వివరించారు.

ఉద్యమంలా శానిటేషన్ పనులు జరగాలి



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాలజోన్: జిల్లాలో శానిటేషన్ పనులు ఉద్యమంలా జరగాలని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అధికారులకు సూచించారు. జెడ్పీ కార్యాలయంలో శానిటేషన్, సీజనల్ వ్యాధులపై శనివారం సమీక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా హెల్త్, శానిటేషన్ విభాగాలు కలిసి పనిచేయాలని సూచించారు. గ్రామీణులు పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నరేశ్, డెప్యూటీ సీఈవో రఘువరణ్, డీఎంహెచ్‌వో శ్రీధర్, డీపీవో దేవరాజ్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై చీటింగ్ కేసు

జగిత్యాలక్రైం: నూకపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అనర్హులకు ఇళ్లు కేటాయించేలా చేసిన కలెక్టరేట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాజేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకోకున్నా నలుగురికి, దరఖాస్తు చేసుకున్న ఐదుగురికి ఇళ్లు కేటాయించేలా కంప్యూటర్ డాటాలో వారి పేర్లు పొందుపరిచారని, నూకపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల డీఈఈ రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

అర్హులను కాదని..

'డబుల్ ఇళ్ల' అవకతవకలకు బాధ్యులెవరు..?

- ఉద్యోగిని విచారిస్తున్న పోలీసులు
- విధుల నుంచి తొలగింపు



డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో జరిగిన అవకతవకలపై అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు. తాము అర్హులను ఎంపిక చేసినప్పటికీ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అవకతవకలకు పాల్పడిన అనర్హులను చేర్చినట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు సదరు ఉద్యోగిపై కేసు పెట్టగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం. సదరు ఉద్యోగిని విధుల నుంచి తప్పిస్తూ అదనపు కలెక్టర్ లత ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు జాబితాలో అనర్హుల పేర్లను ఎవరు చేర్చారు..? దీని వెనుక ఎవరున్నారు..? అనే కోణంలో అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే బీర్‌పూర్ మండలానికి చెందిన 9 మందికి జగిత్యాలలో డబుల్‌బెడ్‌రూం కేటాయించినట్లు బయటపడగా.. ఇంకేమైనా బయటవారికి కేటాయించారా..? అనే కోణంలో అధికారులు పరిశీలిస్తున్నారు.

ఉద్యోగం నిర్వాకంతో ఇలా..

ప్రభుత్వం జగిత్యాలకు ప్రతిష్టాత్మకంగా 4520 ఇళ్లను కేటాయించింది. నూకపల్లి అర్బన్ కాలనీలో గేటెడ్ కమ్యూనిటీ మాదిరిగా అందంగా నిర్మించారు. ఈనెల 3న మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వాటిని ప్రారంభించారు. కొందరు గృహప్రవేశం కూడా చేశారు. రెండురోజుల అనంతరం కొందరు అనర్హులకు డబుల్‌బెడ్‌రూంలు ఇచ్చారని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు విచారణ ప్రారంభించారు. అయితే గతంలోనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో కేవలం జగిత్యాలకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారించి అర్హులతోనే జాబితా రూపొందించారు. తొలి విడతలో 3,722 ఇళ్లు కేటాయించారు. ఇందులో సారంగాపూర్, బీర్‌పూర్, మేడిపల్లి మండలాలకు చెందిన కొందరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు వచ్చాయి. అదే హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకంతోనే ఈ తతంగం కొనసాగినట్లు తెలుస్తోంది.

ఇంకెన్ని ఉన్నాయో..?

ఇతర మండలాలకు చెందిన 9 నుంచి 10 మంది వరకు ఉన్నట్లు తెలుస్తున్నా.. ఇంకా ఎన్ని ఉన్నాయోనని అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. జాబితాలో ఇంకా ఏయే మండలాల వారు ఉన్నారు..? అనర్హులను ఏమైనా చేర్చారా..? అని పరిశీలిస్తున్నారు. ఈ విషయంలో సదరు ఉద్యోగి నోరు విప్పితేనే బయటకు రానుంది.

విచారణ చేపడుతున్నాం

హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అనర్హుల పేర్లను జాబితాలో చేర్చినట్లు మా దృష్టికి వచ్చింది. సదరు ఉద్యోగిపై కేసు నమోదు చేశాం. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు.

– రాజేశ్వర్‌రావు, హౌసింగ్ డీఈ



ఉన్నత చదువు.. పోలీస్ కొలువు

బీటెక్.. ఎంటెక్.. ఎంఫార్మసీ..ఎంబీఏ వంటి కోర్సులు చదివిన వారు కార్పొరేట్ ఉద్యోగాలకు వెళ్లకుండా కానిస్టేబుల్ ఉద్యోగాల వైపు మళ్లారు. మల్టీనేషనల్ కంపెనీలు ఆహ్వానిస్తున్నా.. గవర్నమెంట్ నౌకరీపై మక్కువతో పరీక్షలు రాశారు. ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ఉన్నత విద్యావంతులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిలో తల్లిదండ్రుల కల నెరవేర్చిన వారు కొందరైతే.. పరిస్థితులతో ఇటు వైపు వచ్చిన వారు మరికొందరు.. 8లో▸

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



అర్బన్ ఫారెస్ట్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తూ..

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ధరూర్ క్యాంప్‌లో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న విశ్వకర్మ కుల సంఘం భవనానికి శనివారం భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీలత, విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు టీవీ.సత్యం పాల్గొన్నారు.

హరితహారంతో సత్ఫలితాలు

జగిత్యాలరూరల్: హరితహారంతో సత్ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేటలో నగర్ వన్ యోజనలో భాగంగా రూ.2 కోట్లతో చేపట్టిన అర్బన్ ఫారెస్ట్ పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆహ్లాదం పంచేలా పార్కులు నిర్మిస్తున్నామని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ దివాకర, జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ మల్లారెడ్డి, ఎఫ్ఆర్వో ప్రణీత్‌కౌర్, అరుణ్‌కుమార్, ఎంపీడీవో శైలజరాణి పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

జాబితాపూర్‌కు చెందిన మున్నూరుకాపు సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ మమత, ఎంపీటీసీ శ్రీనివాస్ ఉన్నారు. హస్నాబాద్‌కు చెందిన శాలివాహన సంఘం భవనానికి రూ.3లక్షలు మంజూరుకాగా.. ఎమ్మెల్యే మంజూరు పత్రం అందించారు.

న్యాక్ ద్వారా యువతకు శిక్షణ

రాష్ట్ర ప్రభుత్వం న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతర్గాం ఎస్సీ కాలనీలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ పూర్తి చేసుకున్న 16 మంది మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు న్యాక్ ద్వారా శిక్షణ ఇస్తోందని, యువత స్వయం ఉపాధి పొందుతోందని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, రైతు మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచ్ బోనగిరి నారాయణ, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి.

సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. పెంబట్ల, పోచంపేటలో రూ.20లక్షల చొప్పున గ్రామపంచాయతీ భవనాలు, రూ.1.30 కోట్లతో పెంబట్ల నుంచి పెద్దమ్మ ఆలయం వరకు రోడ్డు, రంగేట నుంచి ఆలూరు వరకు రూ.56లక్షలతో బీటీ రోడ్డు, రూ.10లక్షలతో సీసీ రోడ్డు, రూ.3లక్షలతో రామాలయం, నాగునూర్‌లో రూ.10లక్షలతో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, వైస్ఎంపీపీ సొల్లు సురేందర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బోటు షికారు చేద్దాం రండి..

- మద్దుల చెరువులో టూరిజం ఏర్పాట్లు
- అందుబాటులో స్పీడ్, డీలక్స్ బోట్లు



మద్దుల చెరువు మినీట్యాంక్‌బండ్‌లో షికారు

కోరుట్ల: పట్టణంలోని మద్దులచెరువును ప్రభుత్వం మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చడంతో పర్యాటక శాఖ అందులో బోట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న కోరుట్ల వాసులు కల నిజమైంది. కలెక్టర్ యాస్మిన్ బాషా, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట విద్యాసాగర్‌రావు మినిట్యాంక్‌తోపాటు బోటు షికారు కూడా ప్రారంభించారు. టూరిజం శాఖ నుంచి డీలక్స్ బోటు, స్పీడ్ బోటు తెప్పించారు. ఈ పరిసర ప్రాంతాల్లో బోటు షికారు ఎక్కడా లేకపోవడం.. కోరుట్లలో అందుబాటులోకి రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

షికారుకు.. రెండు బోట్లు

ఆహ్లాదకరమైన చల్లటి వాతావరణంలో సాయంత్రం బోటు షికారు మంచి అనుభూతిని అందిస్తుందనడంలో సందేహం లేదు. సెలవు రోజుల్లో పిల్లాపాపలతో కలిసి సేద దీరడానికి హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు వెళ్లకుండా కోరుట్లలోని మద్దుల చెరువులో రెండు రకాల బోట్లను టూరిజం శాఖ వారు అందుబాటులోకి తెచ్చారు. ఈ రెండు రకాలు బోట్లు ప్రతిరోజూ మినిట్యాంక్ బండ్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం ఉన్న స్పీడ్ బోటులో నలుగురు, డీలక్స్ బోటులో 25 మంది వరకు ప్రయాణించవచ్చు.

అందుబాటులో ధరలు

- కోరుట్ల మద్దుల చెరువు మినీట్యాంక్ బండ్‌లో బోటు షికారు సామాన్యులకు అందుబాటులో ఉండటం విశేషం.
- డీలక్స్ బోటులో ప్రయాణించే వారికి పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 చొప్పున టికెట్ ఉంటుంది.
- నలుగురు కలిసి ప్రయాణించే స్పీడ్ బోటులో షికారుకు రూ.250గా నిర్ణయించినట్లు టూరిజం శాఖ జనరల్ సెక్రటరీ నర్సింహారావు, సూపర్‌వైజర్ తాండ్ర శ్రీనివాస్‌రావు తెలిపారు.
- బోటు షికారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు.

ప్రజల ఆకాంక్ష నెరవేర్చాం



కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట విద్యాసాగర్ రావు ఆలోచన మేరకు మద్దుల చెరువును మినీట్యాంక్ బండ్‌గా మార్చాం. బోటు షికారును అందుబాటులోకి తెచ్చాం. ప్రజల ఆకాంక్ష నెరవేరింది. చాలా సంతోషంగా ఉంది. ప్రజల కోసం రెండు బోట్లు ఏర్పాటు చేయడం అభినందనీయం.

– అన్నం లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్

సర్కారు బడులకు పీఎంశ్రీ నిధులు

- జిల్లాలో 15 పాఠశాలలు ఎంపిక
- ఒక్కో పాఠశాలకు రూ.16 లక్షలు
- రూ.2.40 కోట్లు మంజూరు



ఇటిక్యాలలోని మోడల్‌స్కూల్

రాయికల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద 2023–24 విద్యా సంవత్సరానికి జిల్లాకు రూ.2.40 కోట్ల నిధులు కేటాయించింది. జిల్లాలో 15 పాఠశాలలను ఎంపిక చేయగా, ఈ పాఠశాలల్లో ల్యాబ్, అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు వెచ్చించనున్నారు. ఈ పనులు రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు.

జిల్లాలో 15 పాఠశాలలు

జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద 15 పాఠశాలలు ఎంపికయ్యాయి. జగిత్యాలలో జెడ్పీహెచ్ఎస్ ధరూర్ క్యాంప్, జగిత్యాల మున్సిపాలిటీ గవర్నమెంట్ హైస్కూల్ బస్టాండ్, మేడిపల్లి జెడ్పీహెచ్ఎస్ వెంకట్రావ్‌పేట, మెట్‌పల్లి పెద్దపూర్ క్యాంప్, రాయికల్ ఇటిక్యాల మోడల్‌స్కూల్, సారంగాపూర్ జెడ్పీహెచ్ఎస్ కోనాపూర్, వెల్గటూర్ మోడల్‌స్కూల్, బీర్‌పూర్ ఎంపీపీఎస్, కోరుట్ల మోడల్‌స్కూల్ కల్లూరు, కోరుట్ల మున్సిపాలిటి జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ కోరుట్ల, పెగడపల్లి మోడల్‌స్కూల్, ధర్మపురి మోడల్‌స్కూల్, గొల్లపల్లి మోడల్‌స్కూల్, జగిత్యాల రూరల్ కండ్లపల్లి మోడల్‌స్కూల్, మల్యాల నూకపల్లి మోడల్ స్కూల్ ఎంపిక కాగా, ఎంపికైన ఒక్కో పాఠశాలకు రూ.16 లక్షలు నిధులు మంజూరవుతాయి.

అదనపు తరగతి గదులకు ప్రాముఖ్యత

జిల్లాలో పీఎంశ్రీ కింద మంజూరైన 15 పాఠశాలల్లో రూ.2.40 కోట్లు మంజూరు కాగా, పనులను చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయా పాఠశాలల్లో సమస్యల తీవ్రతను బట్టి ఎంపిక చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం, ల్యాబ్‌లు, విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలు సమకూర్చేందుకు, విద్యార్థులకు ఆటస్థలం ఉండేలా ఈ నిధులు వెచ్చించనున్నారు. ఈ పనులు పాఠశాల యజమాన్య కమిటీ పర్యవేక్షించాల్సి ఉంటుంది.

15 పాఠశాలలు ఎంపిక



జిల్లాలో 15 పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపికయ్యాయి. పాఠశాలల్లో ల్యాబ్, అదనపు తరగతి గదుల నిర్మాణం, డ్యూయల్ డెస్క్ బెంచీలు ఏర్పాటుకు దోహదపడతాయి. టీఎస్ఈడబ్ల్యూఐటీసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పాఠశాల నిర్మాణ పనులను చేపడతారు.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

నేరాల నియంత్రణకు చెక్‌పోస్ట్

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



చెక్‌పోస్టు ప్రారంభిస్తున్న ఎస్పీ భాస్కర్

ధర్మపురి: నేరాల నియంత్రణ కోసం రాయపట్నంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. ధర్మపురి మండలంలో మూడు జిల్లాలకు అనుసంధానమైన రాయపట్నం కూడలి వద్ద పోలీస్ చెక్‌పోస్టు, కమాండ్ కంట్రోల్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 63వ జాతీయ రహదారిపై జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాలను కలిపే రాయపట్నం కూడలి వద్ద చెక్‌పోస్టుతో నేరాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందన్నారు. చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రతి కదలికను గుర్తిస్తూ హైదరాబాద్‌లోని కంట్రోలు రూమ్‌కు చేరవేస్తుందని వివరించారు. కంట్రోల్ రూం ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులు, దాతలు, సీఐ రమణామూర్తి, ఎస్సై దత్తాత్రి, కానిస్టేబల్ తిరుపతి నాయక్‌ను ఎస్పీ అభిందించారు. డీఎస్పీ వెంకటస్వామి, ఎస్సైలు రామకృష్ణ, శ్వేత, నరేశ్, సందీప్ తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణకు చర్యలు

జగిత్యాలక్రైం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ అధికారులతో శనివారం సమావేశమయ్యారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు జిల్లాను గుడుంబారహితంగా మార్చేలా కృషి చేయాలని, గుడుంబా తయారుదారులపై నిఘా పెట్టాలని సూచించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీమ్, డీఎస్పీ వెంకటస్వామి, ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు జానీమియా, వేణు పాల్గొన్నారు.

హరిత గణాంక సూచీలో ర్యాంక్



సభ్యులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

జగిత్యాల: హరిత గణాంక సూచిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అత్యుత్తమ ర్యాంక్ సాధించిందని ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమంలో భాగంగా కళాశాలలో గ్రీన్ కవర్ పెరిగిందని, బొటానికల్ గార్డెన్, మెడిసినల్ అండ్ హెర్బల్ గార్డెన్ ఏర్పాటు చేశామని, గ్రీన్ ఆడిట్ సెల్ సభ్యుల కృషికిగాను కళాశాలకు బీ ప్లస్‌ప్లస్ ర్యాంక్ వచ్చిందని వెల్లడించారు. హరిత గణాంక సూచి సభ్యులు జి.మానస, పడాల తిరుపతిని సత్కరించారు.

రాజన్న ఆదాయం రూ.1.68 కోట్లు



నగదు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు హుండీల ద్వారా రూ.1.68 కోట్ల ఆదాయం వచ్చింది. నగదుతోపాటు 242 గ్రాముల బంగారం, 13 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో ప్రతాప నవీన్ తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య శనివారం గుడిలోని ఓపెన్‌స్లాబ్‌లో హుండీ లెక్కింపు చేపట్టారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

కథలాపూర్(వేములవాడ): భార్యను అదనపు కట్నం వేధిస్తున్నందుకు కోరుట్లకు చెందిన సామల్ల రాందాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బొమ్మెనకు చెందిన సామల్ల అశ్వినికి రాందాస్‌తో 12ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కొద్దిరోజులుగా అదనంగా రూ.5 లక్షలు తేవాలని భార్యను వేధిస్తున్నాడు. అశ్విని ఫిర్యాదు మేరకు రాందాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జగిత్యాలలో మరొకరిపై

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వాణీనగర్‌కు చెందిన గొర్రె అలేఖ్యను అదనపు కట్నం కోసం వేధించిన ఆమె భర్త గొర్రె మనోహర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. వాణీనగర్‌కు చెందిన అలేఖ్యతో 2012లో ఆమె మేనబావ, కరీంనగర్‌కు చెందిన మనోహర్‌తో వివాహం చేశారు. ఆ సమయంలో రూ.8లక్షల నగదు, ఇంటి నిర్మాణానికి మరో రూ.5లక్షలు ముట్టజెప్పారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. మనోహర్ కామారెడ్డి నీటిపారుదల శాఖలో నిజాంసాగర్ ప్రాజెక్టు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. అలేఖ్యను కొద్దికాలంగా అనుమానించడంతోపాటు అదనపు కట్నం కింద రూ.కోటి కావాలంటూ వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మనోహర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు

జగిత్యాలక్రైం: జిల్లాలో గుడుంబా తయారుచేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో మాట్లాడారు. సెప్టెంబర్ 1 నుంచి ఇప్పటివరకు 31 గుడుంబా కేసులు నమోదు చేశామని, 23 మందిని అరెస్ట్ చేశామని, 95 లీటర్ల గుడుంబా, 50 కిలోల బెల్లం పట్టుకున్నామని, 670 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని తెలిపారు. అలాగే నిందితులు వినియోగించిన రెండు వాహనాలను సీజ్ చేశామన్నారు. అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి మద్యాన్ని సీజ్ చేశామన్నారు. 81మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామన్నారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం


పరుశురామ్ (ఫైల్)

పెగడపల్లి: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఓ యువ రైతు ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో చనిపోయిన ఘటన మండలంలోని సుద్దపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాలువ పరుశురామ్ (30)కు గ్రామంలో రెండున్నర ఎకరాల పొలం ఉంది. ఎప్పటిలాగే నీరు పెట్టేందుకు ఉదయం వెళ్లాడు. అయితే మోటార్ నడవకపోవడంతో పరిశీలించేందుకు వెళ్లే ప్రయత్నంలో ఇనుప పైపును తాకాడు. అప్పటికే దానికి విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. పరుశురామ్ కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచి హారిక, ఎంపీటీసీ విజయలక్ష్మీ ప్రభుత్వాన్ని కోరారు.

ఉన్నత చదువు.. పోలీస్ కొలువు



- జీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎం.ఫార్మసీ చదివి.. కానిస్టేబుళ్లుగా ఎంపిక
- తల్లిదండ్రుల కోరిక
- ప్రభుత్వ ఉద్యోగమంటే మక్కువ
- లక్ష్యాన్ని చేరుకున్న యువత



కరీంనగర్‌క్రైం: వారంతా.. బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎం.ఫార్మసీ వంటి ఉన్నత చదువులు చదివారు. తల్లిదండ్రుల కోరిక, ప్రభుత్వ ఉద్యోగం.. అందులోనూ పోలీస్ శాఖలో కొలువుపై మక్కువతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. చివరికి కానిస్టేబుళ్లుగా ఎంపికై, లక్ష్యాన్ని చేరుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అలాంటి అభ్యర్థులపై ప్రత్యేక కథనం.

పోలీస్ కావాలనుకున్నా..



మాది మంచిర్యాల. నేను ఎం.ఫార్మసీ చేశాను. చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలనుకున్న. అమ్మానాన్న రజిత–ఎల్లయ్య. నాన్న అటెండర్. వారి ప్రోత్సాహంతో ఉద్యోగం కరీంనగర్‌లో శిక్షణ తీసుకున్న. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా.

– తోకల అనూష, ఎం.ఫార్మసీ

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



చిన్ననాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం చేయాలని లక్ష్యం ఉండేది. అమ్మనాన్న సత్తమ్మ–నర్సయ్య. నాన్న తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎంబీఏ చేశాను. కరీంనగర్‌లో కోచింగ్ తీసుకొని, సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– ప్రవళిక, ఎంబీఏ

అమ్మానాన్న కల



మాది అంతర్గాం మండలంలోని మద్దిరాల. నేను పోలీస్ కావాలనేది మా అమ్మానాన్న పద్మ–లింగయ్య కల. ప్రస్తుతం ఎమ్మెస్సీ మ్యాథమేటిక్స్ చదువుతున్న. కరీంనగర్‌లో శిక్షణ పొంది, టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– మాటేటి సందీప్, ఎమ్మెస్సీ మ్యాథమేటిక్స్

ఇది నాలుగో కొలువు



నేను ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఓయూలో పూర్తి చేశాను. ప్రస్తుతం సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా. ఇది నాకు నాలుగో ప్రభుత్వ కొలువు. మొదట ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా, తర్వాత జైల్ వార్డెన్‌గా, పంచాయతీ సెక్రటరీ ఉద్యోగాలు వచ్చాయి. కానీ వెళ్లలేదు.అమ్మానాన్న, భార్య ప్రోత్సాహంతోనే సాధించగలిగాను.

– కృష్ణంరాజు, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ

నాన్న స్ఫూర్తితోనే..



రామడుగు: నేను బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. మా నాన్న హెడ్ కానిస్టేబుల్. ఆయన స్ఫూర్తితోనే నేను ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. చాలా సంతోషంగా ఉంది.

దూలుముట్టి సాహిత్‌రెడ్డి, బీటెక్

అమ్మా, తమ్ముడు చదివించారు



సైదాపూర్: నాన్న చిన్నతనంలోనే చనిపోయాడు. అమ్మ బట్టలు కుడుతూ, తమ్ముడు కూలీ పనులు చేస్తూ నన్ను ఎం.టెక్ చదివించారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ.. రెండుసార్లు మెయిన్స్‌లో ఫెయిలయ్యాను. పేదరికం కారణంగా కోచింగ్ తీసుకోకుండానే మూడో ప్రయత్నంలో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

నాంపల్లి శివకుమార్, ఎం.టెక్

ప్రైవేటు ఇంజినీర్‌గా చేస్తూ..



రుద్రంగి: మాది రుద్రంగి. నేను బీటెక్ చదివాను. ప్రైవేటు ఇంజినీర్‌గా పనిచేస్తూనే పోలీస్ ఉద్యోగం అంటే ఇష్టంతో ఎస్సై పోస్టుకు దరఖాస్తు చేశాను. రెండు మార్కుల తేడాతో ఆ ఉద్యోగం కోల్పోయాను. ప్రస్తుతం ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– బాసని సూర్యప్రకాశ్, బీటెక్

నాన్న కోరిక..



బోయినపల్లి(చొప్పదండి): మాది తడగొండ గ్రామం. నేను బీటెక్ చదివాను. నాన్న తిరుపతిరెడ్డికి నేను ఎస్సై కావాలని కోరిక. ఇటీవల ఎస్సై పరీక్షా ఫలితాల్లో కొద్దిలో జాబ్ మిస్సయ్యాను. ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది.

– గోగూరి సాయికృష్ణారెడ్డి, బీటెక్

ప్రభుత్వ ఉద్యోగం చేయాలని..



చందుర్తి(వేములవాడ): మాది మల్యాల గ్రామం. నేను ఎంబీఏ పూర్తి చేశాను. నాన్న నర్సయ్య వ్యవసాయం, అమ్మ లక్ష్మి బీడీలు చేస్తున్నారు. రెండేళ్లుగా ఓ ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న. ప్రస్తుతం కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– మేరుగు ఉదయ్, ఎంబీఏ

నాన్న పోలీస్ అవ్వాలనేవారు



మాది కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్. నాన్న తిరుపతి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 2013లో గుండెపోటుతో చనిపోయారు. నాకు ఒక అక్క, చెల్లి ఉన్నారు. మాలో ఒకరు పోలీస్ అవ్వాలని నాన్న అనేవారు. నేను ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి, ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– కట్ట సాయిచైతన్య, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ

ఆనందంగా ఉంది



రుద్రంగి: మాది రుద్రంగి. అమ్మానాన్న నన్ను ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలని కలలుగన్నారు. వాటిని నిజం చేస్తూ నేను ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. వారి కోరిక తీర్చినందుకు చాలా ఆనందంగా ఉంది.

తోకల శేఖర్, బీటెక్

పోలీస్ కావాలన్నదే కోరిక



కోరుట్ల రూరల్: మాది పైడిమడుగు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాను. ఏదో ఒకరోజు పోలీస్ కావాలన్నదే నా కోరిక. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకొని, మొదటి ప్రయత్నంలోనే ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– దొమ్మటి మణిదీప్, బీటెక్

పోలీస్ డ్రెస్ అంటే ఇష్టం



కోరుట్ల రూరల్: మాది పైడిమడుగు. నాకు చిన్నప్పటి నుంచి పోలీస్ డ్రెస్ అంటే ఇష్టం. బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేశా. హైదరాబాద్‌లో పోలీస్ కోచింగ్ తీసుకొని, మొదటి ప్రయత్నంలోనే ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– అరిసె రోహిత్,

జైల్ వార్డెన్‌గా ఎంపికయ్యా



మల్యాల: మాది తాటిపల్లి అనుబంధ గ్రామం కొంపల్లి. అమ్మానాన్నా కమల–గంగారాం. నేను ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశాను. గ్రూప్స్‌కి సన్నద్ధమై, కానిస్టేబుల్ పరీక్ష రాసి, జైల్ వార్డెన్ ఉద్యోగానికి ఎంపికయ్యా.

కల్లెం మహేందర్, ఎంఏ ఎకనామిక్స్

వ్యవసాయ పనులకు వెళ్తూ..



ఎల్లారెడ్డిపేట: మాది అక్కపల్లి గ్రామం. అమ్మానాన్న రాజవ్వ–కొమురయ్య. నేను వ్యవసాయ పనులకు వెళ్తూ బీటెక్ వరకు చదివా. అమ్మానాన్న కష్టం చూసి, ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకున్న.సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– మమత, బీటెక్

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం వదిలి..



ఎల్లారెడ్డిపేట: మాది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం. అమ్మానాన్న వరలక్ష్మి–కుబేరస్వామి. నేను ఎంటెక్ పూర్తి చేశాను. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న. నాన్న ప్రభుత్వ టీచర్. నేను ఉద్యోగం వదిలేసి, ఇంటి వద్దే చదివి, సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. సాయి రామకృష్ణ, ఎం.టెక్

మొదటి ప్రయత్నంలోనే..



వేములవాడరూరల్: మాది చెక్కపల్లి. నేను ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. ప్రభుత్వ, బ్యాంకు ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతుండగా కానిస్టేబుల్ నోటిఫికేషన్ వచ్చింది. దీంతో సన్నద్ధమై, మొదటి ప్రయత్నంలోనే సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

మెతుకు మమత, ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్

అన్నయ్య స్ఫూర్తితో..



కోల్‌సిటీ: నాన్న ధర్మారావు రైతు. అమ్మ లక్ష్మి గృహిణి. అన్నయ్య సివిల్ కానిస్టేబుల్. అన్నయ్య స్ఫూర్తితో పోలీస్ కొలువు సాధించాలనేది లక్ష్యం. తొలిప్రయత్నం విఫలమైంది. మరింత పట్టుదలతో రెండోసారి సివిల్ కానిస్టేబుల్ కొలువు సాధించిన.

– కొమ్మరినేని ధర్మేందర్‌రావు, బీకాం కంప్యూటర్స్, ముస్త్యాల

ఎస్సై కొలువు లక్ష్యం



కోల్‌సిటీ: నాన్న మల్లయ్య మేస్త్రీ, అమ్మ లక్ష్మి గృహిణి. గోదావరిఖనిలో మూడు నెలల శిక్షణ తీసుకున్న. ఎస్సై జాబ్ కోసం పరీక్ష రాస్తే రాలేదు. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన. చాలా సంతోషంగా ఉంది. ఎలాగైనా ఎస్సై కొలువ సాధిస్తా..

– తడకపెల్లి అనిల్‌కుమార్, బీటెక్(మెకానికల్), తెలుకుంట, జూలపల్లి

సివిల్స్ సాధిస్తా



కోల్‌సిటీ: నాన్న శ్రీనివాస్ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుడు. అమ్మ మమత. సివిల్స్‌లో జాబ్ కొట్టాలని నా ఆశ. చాలా ప్రిపేర్ అయ్యా. కానీ గ్రూప్–1 వాయిదా పడింది. ఇప్పుడు ఓపెన్ కేటగిరీలో ఫైర్ విభాగంలో ఉద్యోగం వచ్చింది. ఈ కొలువు చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేరవుత.

– గుంటుకు వివేక్, బీటెక్ (మెకానికల్), గోదావరిఖని

అనుకోకుండా వచ్చింది



కోల్‌సిటీ: నాన్న నారాయణ, అమ్మ లక్ష్మి. చిన్నవ్యాపారం చేస్తడు. గోదావరిఖనిలో పోలీసు ఉద్యోగం శిక్షణ తీసుకున్న. కానీ, అనుకోకుండా ఐటీ, కమ్యూనికేషన్ సెల్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. హ్యాపీగా ఉంది.

– ఈర్ల సాయికిరణ్, బీటెక్(ఎలక్ట్రానిక్స్), మల్యాలపల్లి

కొడుకుపై తండ్రి దాడి

కథలాపూర్: మండలంలోని చింతకుంటకు చెందిన దండవేని గంగనర్సయ్యపై కొడుకు హరికృష్ణపై దాడి చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. తండ్రీకొడుకు ఈనెల 6న ఇంట్లో అప్పుల విషయమై చర్చించుకుంటున్నారు. మాటమాట పెరగడంతో గంగనర్సయ్య హరికృష్ణ తలపై కర్రతో కొట్టాడు. హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్యవసర సేవలకు అంతరాయం

- సమ్మెలో ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు
- ఉద్యోగ భద్రత, పెండింగ్ బిల్లుల కోసం పోరుబాట



గొల్లపల్లి: ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు కోసం ఆశా కార్యకర్తలు, కనీస వేతనం, ప్రతినెలా బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె బాట పట్టడంతో జిల్లాలో అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 16 రోజులుగా భోజనం అందడం లేదు. దీంతో విద్యార్థులు ఇంటినుంచే టిఫిన్ బాక్స్‌లు తీసుకొచ్చుకుంటున్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 20 పీహెచ్‌సీ పరిధిలో దాదాపు వెయ్యి మంది వరకు ఆశా వర్కర్లు సమ్మె బాట పట్టారు. అన్ని మండలాల్లో నిరసన దీక్షలు చేపట్టారు. రూ.18వేల వేతనం చెల్లించడంతోపాటు, ఉద్యోగభద్రత కల్పించాలని, హెల్త్‌కార్డులు, రూ.5లక్షల బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతున్నారు. మరోవైపు 20రోజులుగా మధ్యాహ్న భోజన కార్మికులు కనీసవేతనం అందించడంతోపాటు ప్రతినెలా బిల్లు చెల్లించాలని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సమ్మె చేపడుతున్నారు. జిల్లాలో 511 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 187 జెడ్పీహెచ్ఎస్, 13 దల్ స్కూళ్లు ఉన్నాయి. గతనెల 28 నుంచి జిల్లాలోని 796 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందడం లేదు. మరోవైపు ప్రభుత్వం ఇటీవల అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే మధ్యాహ్న భోజనమే చేసేవారు లేరంటే అల్పాహారం ఎవరు చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

అప్పు చేసి భోజనం పెట్టాం



ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రాక బయట అప్పు చేసి మరీ విద్యార్థులకు వండి పెట్టాం. మాకు న్యాయం చేయాలని 20రోజులుగా భోజనం వండటం లేదు. మాకు వచ్చే గౌరవ వేతనం చాలా తక్కువ. కనీసం వేతనం, వంటగది, వంటపాత్రలు ఇవ్వాలి. – **ముత్యాల గౌరవ్వ, మధ్యాహ్న భోజన సంఘం జిల్లా అధ్యక్షురాలు**

డిమాండ్లు నెరవేర్చాలి



ఆశ వర్కర్లకు రూ.18 వేల వేతనం చెల్లించాలి. ఉద్యోగభద్రత కల్పించడంతోపాటు హెల్త్‌కార్డులు జారీ చేయాలి. మాకు న్యాయం చేయాలని ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదు.

– **జంగిలి అంజలి, ఆశావర్కర్ల సంఘం మండల ఉపాధ్యక్షురాలు**

సమ్మె కొనసాగిస్తాం



ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకూ వారికి మద్దతుగా సమ్మె కొనసాగిస్తాం. సేవారంగంలో ఉన్న వీరికి ప్రభుత్వం కనీస వేతనం కూడా అందించక పోవడం శోచనీయం. న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి. – **ఇందూరి సులోచన, సీఐటీయూ జిల్లా కన్వీనర్**

ఇంటింటికీ 'గ్యారంటీ' ప్రచారం

- కాంగ్రెస్‌ను గెలిపిస్తే మహిళలకు పెద్దపీట
- డీసీసీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేశారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దోనూర్, నక్కలపేట, బూరుగుపల్లె గ్రామాల్లో పర్యటించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, తప్పతాలు పేరుతో ధాన్యాన్ని క్వింటాల్‌కు 10కిలోల వరకు తరుగు తీశారని గుర్తు చేశారు. భారీవర్షాలతో వేలాది ఎకరాల్లో పంటలు కోల్పోయినా పైసా పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. దళితబంధు, బీసీలకు ఆర్థిక సాయం, మైనార్టీబంధు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే


ఐదు గ్యారెంటీలపై వివరిస్తున్న అడ్లూరి

మహిళలకు ఉచిత బస్‌పాస్, రూ.500కే సిలిండర్, ప్రతినెలా 2500 పింఛన్, రైతు భరోసా కింద కౌలు రైతులకు ఏటా రూ.15వేలు, రైతులకు రూ.12వేల చొప్పున అందిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు వివిధ పార్టీల నుంచి 500 మందికి పైగా పార్టీలో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎస్.దినేష్, వేములు రాజు, సింహరాజు ప్రసాద్, చిలుముల లక్ష్మణ్, వడ్లూరి సత్యం, రఫియోద్దిన్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

జగిత్యాలరూరల్: గ్రామాల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం జగిత్యాలరూరల్ మండలం కన్నాపూర్‌లో కన్నాపూర్–రంగపేట వరకు రూ.కోటితో నిర్మించే బీటీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. ముందుగా మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. నర్సింగాపూర్‌లో బతుకమ్మ ఘాట్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ ఖాయమన్నారు. జెడ్పీటీసీ మహేశ్, సర్పంచ్ కొక్కు సుధాకర్, సురకంటి స్వప్న, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి ఉన్నారు.


శంకుస్థాపన చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్

అనుబంధ రంగాలతో రైతులకు ఆదాయం

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ అనుబంధ రంగాలతో రైతులకు ఆదాయం వస్తుందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతినారాయణ్‌భట్ అన్నారు. పొలాస వ్యవసాయ కళాశాలలో సద్గురు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు పట్టు పురుగుల పెంపకంపై నాలుగు రోజులుగా నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. రైతులు పట్టుపురుగులు, పాడి, ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, ప్రొఫెసర్లు హేమలత, విజయరాఘవన్, రత్నాకర్ పాల్గొన్నారు.


సర్టిఫికెట్లతో శిక్షణపూర్తి చేసుకున్న రైతులు